క్లుప్తంగా

యోగాసన పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో యూసీఈకే వీసీ ప్రసాద్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కోకనాడ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న కాకినాడలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసనాల పోటీల్లో జేఎన్టీయూకే విద్యార్థులు ప్రతిభ చాటారని వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ సోమవారం తెలిపారు. యూసీఈకేలో పెట్రోలియం ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థి ఎ.అభిరామ్ ఆర్టిస్టిక్ సోలో విభాగంలో ప్రథమ, మెకానికల్ ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ విద్యార్థినులు ఎ.గీతా సంజన, ఎస్.శైలజ ఆర్టిస్ట్ ఫెయిర్ విభాగంలో మొదటి స్థానం సాధించారన్నారు. వీరు ఆగస్టులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజేతలను వీసీ ప్రసాద్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

సేవలు చిరస్మరణీయం



సుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు, సభ్యులు

కరప: వేళంగిలో వైద్యుడిగా, మాజీ సర్పంచ్‌గా డాక్టర్ బూసం సుబ్రహ్మణ్యం అందించిన సేవలు చిరస్మరణీయమని అక్కడి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులు అన్నారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించి, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి అందరి మన్ననలు పొందారన్నారు. గ్రామస్తులు కుంచే మేడిశెట్టి పట్టాభి, సానా శ్రీను, వాసంశెట్టి సుబ్బారావు, పురం ప్రసాద్, ముడుగు కృష్ణ, చాపల శివ, రాంబాబు, నరేష్, దూడల వీరేంద్ర, గ్రాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుకు చేయూత

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ప్రముఖ టీ పొడి వ్యాపారి మల్ల చంద్రశేఖర్ దంపతులు తండ్రిని కోల్పోయిన చిన్నారుల చదువుకు సాయమందించారు. ఈ మేరకు రూ.50 వేల నగదు మొత్తాన్ని కాకినాడ గ్లాస్ హౌస్ సెంటర్‌లో ఉన్న శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, శ్రీ యువసేన ద్వారా ఇంటి దిక్కును కోల్పోయిన ఎందరో పిల్లల చదువుకు దాతల సాయంతో భరోసా ఇస్తున్నామని, చంద్రశేఖర్ దంపతులు అందించిన విరాళం ఇందులో కొందరి చదువుకు తోడ్పాటునిస్తుందని అన్నారు. అనంతరం వారిని సతీష్ సత్కరించి అయోధ్య రాముడి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో సీహెచ్ దుర్గారావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం చేయాలని బలవంతం

కాకినాడ క్రైం: జీవనోపాధి కోసం వెళ్లిన ఓ యువతిని వ్యభిచారం చేయాలని బలవంతం చేస్తున్న పెద్దాపురానికి చెందిన భారతిపై చర్యలు తీసుకోవాలని, బాధితురాలిని రక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం, పోలీసులు తగిన రీతిలో స్పందించాలని కమిటీ కోరింది. ఈ మేరకు, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి, జిల్లా కోశాధికారి కొయ్య నాగజ్యోతి, జిల్లా కమిటీ సభ్యురాలు భూలక్ష్మి సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఆ యువతికి న్యాయం జరగకపోయేసరికి తనను తాను రక్షించుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్లి సామాజిక మాధ్యమాల ద్వారా తన వేదనను వెళ్లబోసుకుందని తెలిపారు. బాధితురాలికి చంటి పాప ఉందని ఆమెతో పాటు పాపకు రక్షణ కల్పించాలని ఈ మేరకు ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఇటువంటి దురాగతాలు పెద్దాపురంలో కొనసాగుతున్నాయని, పోలీసులు తగిన నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.

పంచారామ క్షేత్రంలో పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయంలోని స్వామి, అమ్మవార్లను భక్తులు కొలిచారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేశారు. ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా అందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, ఆళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాదికాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఆషాఢ మాసంలోని మాసశివరాత్రి రోజున అమ్మవారికి శాకంబరి అలంకరణ ఉంటుందన్నారు.

కాలువరమే..!

- అధ్వానంగా పేట కాలువ
- గుర్రపుడెక్క, చెత్తతో నిండిన వైనం
- తిమ్మాపురం, రమణయ్యపేట వాసులకు గండం



తిమ్మాపురం వద్ద గుర్రపుడెక్కతో నిండిపోయిన పేట కాలువ



రమణయ్యపేటలో సర్పవరం రోడ్డు వంతెన వద్ద చెత్తతో నిండిపోయిన పేట కాలువ

కాకినాడ రూరల్: మురుగు పారాలంటే కాలువలు కీలకం.. వర్షాకాలం వచ్చిందంటే ముంపు సమస్య రాకుండా చేసేవి ఇవే. అయితే అధికారుల ఉదాశీనత, పాలకుల నిర్లక్ష్యంతో ఇవి బక్కచిక్కి ఎందుకూ కొనగాకుండా మారుతున్నాయి. ఎక్కడికక్కడే గుర్రపుడెక్క, చెత్తతో నిండి నామరూపాల్లేకుండా తయారవుతున్నాయి. ఫలితంగా పరిసర ప్రాంతాల్లోని లోతట్టు కాలనీ వాసులకు నరకం చూపిస్తున్నాయి. జిల్లా కేంద్రం కాకినాడ నగరాన్ని ఆనుకుని ఉన్న రూరల్ మండలంతో పాటు నగరంలోని మధురానగర్ వరకూ విస్తరించి ఉన్న మేజర్ డ్రైనేజీపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యం అలముకుంది. వర్షాకాలం అయినప్పటికీ వేసవిని తలపించేలా ఎండలు ఉండడంతో ప్రస్తుతం సమస్య లేనప్పటికీ.. ఒక్కసారిగా వాతావరణం మారి వర్షాలు పడితే పేట కాలువ పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ముంపు సమస్యతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తిమ్మాపురం నుంచి రమణయ్యపేట మీదుగా నగరంలోని మధురానగర్ వరకూ ఈ పేట కాలువ విస్తరించి ఉంది. విశాలమైన మేజర్ డ్రైనేజీ అయినా, ఇప్పుడు ఆక్రమణలతో పాటు కాలువ పొడవునా గుర్రపుడెక్కతో నిండిపోయింది. నీరు పారేందుకు గుర్రపుడెక్క అడ్డంకిగా మారతుంది. మరోవైపు డ్రైనేజీలో పూడికతీత, తుప్పల తొలగింపు వంటి పనులు క్లోజర్ పనుల్లో చేపట్టలేదు. దారుణమైన విషయమేమిటంటే సర్పవరం రోడ్డు మార్గంలో రమణయ్యపేట గ్రామ పరిధిలో ఈ డ్రైనేజీ దాటిన వెంటనే డంపింగ్ యార్డుగా మార్చేశారు. కార్పొరేషన్ చెత్తతో పాటు రమణయ్యపేట గ్రామంలోని చెత్తను డ్రైనేజీలో వేయడంతో వర్షాల సమయంలో నీరు పారేందుకు వీల్లేకుండా పోతుంది. అలాగే తిమ్మాపురం గ్రామ పరిధిలోని అవంతినగర్, మారుతీనగర్, రమణయ్యపేట పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీతో పాటు శుభానికేతన్ స్కూల్ వెనక ప్రాంతంలోని జనచైతన్య లే అవుట్‌లో నివాసాలు ముంపులో చిక్కుకునే ప్రమాదం ఉంది. ఇక్కడ సుమారు 10 వేల మంది నివసిస్తున్నారు. ప్రతి వీధిలోనూ ముంపు సమస్య ఉంటోంది. గత వరదల సమయంలో ఇక్కడ పడవలపై తిరగాల్సిన వచ్చింది. ఈ అనుభవాల నేపథ్యంలో ఈ పేట కాలువను అభివృద్ధి చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్షణమే డ్రైనేజీ అధికారులు స్పందించి పూడికతీతతో పాటు ఆక్రమణలు, చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డంపింగ్ యార్డులా మార్చేశారు



తుపాన్ల సమయంలో ఏటా అవంతినగర్ కాలనీ ముంపునకు గురవుతోంది. నేతలు, ప్రజాప్రతినిధులు వచ్చి ముంపు బాధితుల పట్ల సానుభూతి చూపుతుంటారు. అంతేతప్ప సమస్య పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవడం లేదు. ముందుగా డ్రైనేజీలో పూడికతీత, చెత్త తొలగింపు పనులు చేపట్టాలి.

– గండి శ్రీనివాస పాపారావు, అవంతినగర్ కాలనీ వాసి, తిమ్మాపురం

పూడికతీత పనులు చేపట్టాలి



పంట కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. మురుగు కాలువలను మాత్రం పట్టించుకోవడం లేదు. కాలువలు సక్రమంగా లేకపోతే నీరు పారక కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. పేట కాలువలో రమణయ్యపేట వద్ద చెత్తను వేస్తున్నారు. దీనిని నిలుపుదల చేసి, అవుట్‌లెట్ పూడికతీత పనులు చేపట్టాలి.

– బెజవాడ వీరవెంకట సత్యనారాయణ, సర్పంచ్, తిమ్మాపురం

గాంధీభవన్ నిర్వహణ అద్భుతం



గాంధీ విగ్రహానికి నూలు దండ వేస్తున్న చక్రపాణి

బోట్‌క్లబ్: గాంధీభవన్ నిర్వహణ ఎంతో బాగుందని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, ఆంధ్ర మహిళా సభ కమిషనర్ డి.చక్రపాణి అన్నారు. స్థానిక వెంకటరత్నపురంలోని గాంధీభవన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. గాంధీ విగ్రహానికి నూలు దండ వేసి నివాళి అర్పించారు. గాంధీభవన్ ప్రాంగణంలోని గాంధీ గ్రంథాలయం, ఉన్నతి సంస్థ ద్వారా అమలవుతున్న ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. గాంధీభవన్‌కు తన తరపున, ప్రభుత్వం తరపున తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. యువత ఉన్నత ఉద్యోగాలు పొందడానికి వీలుగా ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణకు అవసరమైన పుస్తకాలను దాతల సహకారంతో సమకూర్చుతున్నామని గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ తెలిపారు. కార్యవర్గ సభ్యులు ఎంవీ భరతలక్ష్మి, అల్లూరి సురేంద్ర పాల్గొన్నారు.

వానొచ్చే.. ముంపు తెచ్చే

కరప: అమ్మో.. ఇదేం ఎండలంటూ విసుపోయిన జనానికి వర్షం పడడంతో ఉపశమనం కలిగింది. మండలంలో మూడు వారాలుగా అధిక ఉష్ణోగ్రతలకు అల్లాడిన ప్రజలు సోమవారం మధ్యాహ్నం వర్షం పడటంతో ఆహ్లాదంగా గడిపారు. అయితే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ఇబ్బంది పడ్డారు. ఈ నెలలో వేసవిని మించిన ఎండలు కాయడంతో మహిళలు, వృద్ధులు ఆపసోపాలు పడ్డారు. సోమవారం మబ్బులు పట్టి వర్షం పడటంతో హమ్మయ్యా అని అనుకున్నారు. కరప, నడకుదురు, గురజనాపల్లి, వేములవాడ, వలసపాకల, గొర్రిపూడి తదితర గ్రామాల్లో పూర్తి స్థాయిలో డ్రైన్లు లేక వీధులు, రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కరపలో నీరుపోయే మార్గం లేక ఎంఈఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా నీరు నిలిచిపోవడంతో సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కరప హైస్కూల్ ఆవరణలో నిలిచిపోయిన వర్షం నీరు



వాకాడలో ముంపునకు గురైన పొలాలు

ముంపు నీట పొలాలు

మండలంలో కురుస్తున్న వర్షానికి తోడు పైమండలాల నుంచి ముంపునీరు వచ్చి చేరుతుండటంతో పల్లపు ప్రాంతాలు, పల్లపు భూముల్లో వెదజల్లిన పొలాలు, వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. మండలంలోని భూములన్నీ సముద్ర తీరాన, కాలువ శివారున ఉంటాయి. కరప, వలసపాకల, వాకాడ, వేములవాడ, పెదకొత్తూరు, కూరాడ, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో వర్షాలు లేకపోవడంతో రైతులు సార్వా సీజన్‌లో వెదజల్లుకున్నారు. వర్షానికి వెదజల్లిన పొలాలు ముంపునకు గురైనట్టు రైతులు తెలిపారు. మరింత వర్షం పడితే మొలక దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు.

తప్పుడు కేసులు పెట్టడమే 'కూటమి' అజెండా



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లి రాజబాబు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): తప్పుడు కేసులు పెట్టడమే కూటమి ప్రభుత్వం ప్రధాన అజెండా అని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లి రాజబాబు అన్నారు. కాకినాడ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఆయన ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ, డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకూ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను ఎలాగైనా అడ్డుకోవాలనే కుట్రలో భాగమే ఈ లిక్కర్ స్కామ్‌ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలల లోపునే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. ఈ అక్రమ లిక్కర్ కేసు అవినీతి మొదట్లో రూ.50 వేల కోట్లని, తర్వాత రూ.30 వేల కోట్లని, ప్రస్తుతం రూ.300 కోట్లని పొంతన లేని అంకెలు చెప్పి ప్రజలను మోసగించాలని చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని కుట్రలు పన్నినా, రాబోయే కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి గెలుపును ఎవరూ అడ్డుకోలేరన్నారు. దీనిపై ఇంటిలిజెన్స్ సమాచారంతో దిక్కుతోచని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. సమావేశంలో నగర బీసీ సెల్ అధ్యక్షుడు వాసుపల్లి కృష్ణ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చెక్కపల్లి కృష్ణ, కాకినాడ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు బెజవాడ బాబి, రూరల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అనసూయ ప్రభాకర్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు రొక్కాల సత్యనారాయణ, పడాల ఆనంద్ పాల్గొన్నారు.

శాకంబరిగా బాలాత్రిపుర సుందరి



శాకంబరి అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు



వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారి ఆలయ ప్రాంగణం

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం శాకంబరిగా అమ్మవారిని అలంకరించారు. 8 టన్నుల కూరగాయలతో ఆలయ పరిసరాలు ఎంతో అందంగా అలంకరించారు. వంకాయలు, బెండకాయలు, క్యాప్సికం, అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన గోంగూరతో పాటు వివిధ రకాల పండ్లతో గర్భాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 200 మంది భక్తుల సహాయంతో ఆలయాన్ని అందంగా అలంకరించినట్లు ఈఓ వి.వీర్రాజు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో రద్దీగా మారింది. శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాథరావు, డీసీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖాధికారి కె.నాగేశ్వరరావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని అందించేవే గ్రంథాలయాలు

బోట్‌క్లబ్: విజ్ఞానాన్ని అందించేవే గ్రంథాలయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికైన ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్ అన్నారు. స్థానిక వేణుగోపాల సంస్కృత ప్రచార సభ కార్యాలయంలో సోమవారం గ్రంథాలయ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. మన దేశం చరిత్ర, సంస్కృతిని వేల సంవత్సరాల నుంచి గ్రంథాల రూపంలో భద్రపరిచి భావితరాలకు అందిస్తున్నారని కిరణ్ అన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో కీలకంగా వ్యవహరిస్తూ గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేసే కార్యక్రమాలను చేపట్టిన చిరంజీవిని కుమారి ఆశయ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పీఎస్ఎస్ కిరణ్, ఉపాధ్యక్షులుగా అడబాల రత్నప్రసాద్, పి.వెంకన్నబాబు, కార్యదర్శిగా చింతపల్లి సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా సలాది సాయి సత్యనారాయణ, పి.సుబ్బరాజు, కోశాధికారిగా కె.సాయి బాబా, కార్యవర్గ సభ్యులుగా వక్కలంక రామకృష్ణ, జీవీ కృష్ణంరాజు, జీవీకే వర్మ తదితరులను ఎన్నుకున్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



మరిడమ్మ ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ తల్లి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 35 రోజులకు గాను సుమారు రూ.37,50,460 ఆదాయం సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, ఈఓ పళ్లంరాజుల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతర మధ్యలో హుండీలను లెక్కించామన్నారు. అన్నదాన విరాళాలుగా రూ.33,555 వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కరప: మండలంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అందజేశారు. వేళంగికి చెందిన కురుపూడి సూరిబాబు, తిరుపతి వెంకటేశ్వరరావులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందారు. వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు.

కళా రంగానికి సేవలు అద్భుతం



నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బోట్‌క్లబ్: అల్లూరి సీతారామరాజు పేరిట కళా పరిషత్‌ను ఏర్పాటు చేసి కళా రంగానికి చేస్తున్న సేవలు అద్భుతమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ రజతోత్సవ నాటికల పోటీల్లో విజేతలకు సోమవారం స్థానిక సూర్యకళా మందిరంలో బహుమతులు అందజేశారు. కళాపరిషత్ అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి, గౌరవాధ్యక్షులు కర్రి భామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానంద బాబు హాజరై మాట్లాడారు.

పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, ద్వితీయ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు, తృతీయ ప్రదర్శనగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, జ్యూరీ బహుమతిని దేవరాగం నాటికలు గెలుపొందాయి. అలాగే ఉత్తమ నటిగా అనసూయ. సహాయనటిగా జ్యోతిరాజ్, ఉత్తమ నటుడిగా భానుప్రకాష్, సహాయ నటుడిగా కె. నాగేశ్వరరావు, ఉత్తమ రచనగా అమ్మచెక్కిన బొమ్మ రచయిత్రి జ్యోతిరాజ్, ఉత్తమ దర్శకుడిగా అమ్మచెక్కిన బొమ్మ దర్శకుడు గోవాడ వెంకట్ గెలుపొందారు. అలాగే పలు విభాగాలకు నిపుణులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎస్‌వీఎస్ఎస్ మూర్తి, ప్రకాష్ రెడ్డి, లక్ష్మీనారాయణ, పేరయ్య శాస్త్రి, రామ సత్యనారాయణ, పుల్లారావు, మార్నీ జానకిరామ చౌదరి పాల్గొన్నారు.

గంగాధర్‌కు యంగ్ మైండ్స్ అవార్డు

సామర్లకోట: పీబీ దేవం శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ 'యంగ్ మైండ్స్–రేపటి కోసం' స్వచ్ఛంద సంస్థ నుంచి ఆదివారం రాత్రి సేవా పురస్కారం అందుకున్నారు. యంగ్ మైండ్స్– రేపటి కోసం ప్రథమ వార్షికోత్సవం సందదర్భంగా కాకినాడ యంగ్ మెన్ హ్యాపీ క్లబ్ దంటు కళా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసు నాయుడు, పేరా రాజశేఖర్‌ల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు గంగాధర్ స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ మేరకు సోమవారం తోటకూర గంగధర్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, కార్మిక సంఘ నాయకుడు దవులూరి సుబ్బారావులు అభినందించారు.

గ్రామసభలు పక్కాగా నిర్వహించండి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో పీ–4 గ్రామసభలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా, మండల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీ–4 కార్యక్రమంపై సమీక్షించిన సందర్భంగా మాట్లాడారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా సీఎం పీ–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లా స్థాయి అధికారులంతా తమ శాఖల పరిధిలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు తప్పని సరిగా గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు. కాకినాడ జిల్లాలో 1.2 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ షణ్మోహన్ వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 6,149 కుటుంబాలను మార్గదర్శకులు స్వీకరించామని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటరావు, ప్రణాళికాధికారి పి.త్రినాథ్, గృహనిర్మాణ శాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీకి విరాళాలు



కలెక్టర్‌కు విరాళం చెక్కును ఇస్తున్న శ్రీఅగస్త్య డైరెక్టర్ నాగేశ్వరరావు, కృష్ణ వెంకటసాయి

కాకినాడ సిటీ: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి, కాకినాడ హాకీ టోర్నమెంట్‌కు రూ.లక్ష విరాళాన్ని శ్రీఅగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు అందజేశారు. ఈ చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌కు ఇచ్చారు.

మరొకరు రూ.50 వేలు

స్థానికంగా నిర్వహించే హాకీ టోర్నమెంట్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు కేవీఎస్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డి.కృష్ణ వెంకటసాయి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. దీనిని కలెక్టర్ షణ్మోహన్‌కు సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న విజయవాడ డివిజన్ ఉద్యోగులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్ల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ చేతుల మీదుగా 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డు' అందుకున్నారు. జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి సోమవారం విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటుగా సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో వర్చువల్ పద్ధతిలో భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా అన్ని సెక్షన్‌లలో సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం విజయవాడ డివిజన్‌లో విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన సామర్లకోటలోని టీటీఐ డీవీకేఎస్‌పీ చైతన్య, రాజమహేంద్రవరంలోని ట్రైన్ మేనేజర్ కె.పాపారావుకు అవార్డులు అందజేసి అభినందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెద్దాపురం: 11వ రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పెద్దాపురం విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక వరహాయ్యలపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో యోగా గురువు వద్ద శిక్షణ పొందుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కాటా విభాగంలో తెప్పల యోగేశ్వర్ గోల్డ్ మెడల్, కుమిటిలో బంగారు పతకాలు సాధించాడు. బాలికల విభాగంలో యాసలపు సూర్యకళ కాటా, కుమిటి విభాగాల్లో బంగారు పతకం సాధించింది. జూనియర్స్ విభాగంలో పాసిల లోకేష్ కాటా విభాగంలో సిల్వర్, కుమిటి విభాగంలో బంగారు పతకాలు సాధించారు.